సాక్షి ములుగు

ఆదివారం | 12 | జనవరి | 2025



మమ్మేలు మల్లన్న..

భక్తుల కొంగు బంగారం.. లక్షలాది మందికి ఇలవేల్పు.. ఐనవోలు శ్రీమల్లికార్జునుడు బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యాడు.

- 10లో▸



నెహ్రూ జూపార్క్‌కు దీటుగా..

హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్క్‌కు దీటుగా వరంగల్ జూపార్క్‌ను అభివృద్ధి చేస్తానని మంత్రి కొండా సురేఖ అన్నారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం

29.0^0 /17.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రి వేళ చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

డీసీసీ అధ్యక్షుడు అశోక్



విలేకరులతో మాట్లాడుతున్న అశోక్

ములుగు: స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ములుగులో విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు.. ప్రజల మధ్యలో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయాలన్నారు. అధిష్టానం అనుమతి లేకుండా పార్టీ నాయకులు ఎలాంటి ప్రెస్‌మీట్‌లు పెట్టొద్దని సూచించారు. కార్యకర్తల మధ్య విభేధాలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకురావాలని కోరారు. సీనియర్లు, జూనియర్లు కలిసికట్టుగా పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని తెలిపారు.

రామప్ప.. బ్యూటిఫుల్



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయ నిర్మాణం అద్భుతంగా ఉందని, కట్టడం బ్యూటీఫుల్‌గా ఉందని స్విట్జర్లాండ్ దేశానికి చెందిన టీనా దంపతులు కొనియాడారు. టీనా దంపతులు తమ కుమార్తెతో కలిసి రామప్ప రామలింగేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప టెంపుల్ బాగుందని వారు కొనియాడారు. కాగా, టీనా భర్త స్వస్థలం హైదరాబాద్ అని తెలిపారు.

సమ్మక్క సాగర్ గేట్లు మూసివేత



కన్నాయిగూడెం: మండలంలోని తుసాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గోదావరి పై ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ గేట్లను అధికారులు మూసివేశారు. గత కొన్ని రోజుల నుంచి రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్న అధికారులు ఒక గేటును శనివారం మూసి ఒక గేటు ద్వారా 5,069క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. బ్యారేజీలో 59 గేట్లకు 58 గేట్లను మూసి ఉంచారు. బ్యారేజీలోకి ఎగువ నుంచి 5,900క్యూసెక్కుల నీరు చేరుతుంది. ప్రస్తుతం బ్యారేజీలో 79.40 మీటర్ల నీటి మట్టం కొనసాగుతుంది. బ్యారేజీ సామర్థ్యం 6.94 టీఎంసీలకు 3.81 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు.

నిట్‌లో సాతి వర్క్‌షాప్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శనివారం సాతి–సీస్కామ్ (సాఫిస్టికేటెడ్ అనలాటికల్ అండ్ టెక్నికల్ హెల్ప్ ఇన్‌స్టిట్యూట్), సెంటర్ ఫర్ ఇన్‌స్టిట్యూట్ అండ్ కోరిలేటివ్ మైక్రోస్కోపీ) సౌకర్యాలపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఐఐటీ హైదరాబాద్ క్లస్టర్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సౌజన్యంతో రూ.60 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందులో నిట్ వరంగల్ భాగస్వామిగా ఉంటుందని సాతి - సీస్కామ్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ శౌర్య దత్తా తెలిపారు. నిట్ వరంగల్ విద్యార్థులు మైక్రోస్కోపీ వినియోగంపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు, సాతి–సీస్కామ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

యువ.. భిన్నతోవ

- వ్యవసాయం, ఉపాధి రంగాల్లో రాణింపు
- ఉద్యోగం రావడం లేదని నిరాశ పడలేదు..
- నచ్చిన పనులు చేస్తూ విజయ తీరాలకు..
- సొంత సంపాదనతో కుటుంబానికి ఆర్థిక అండ



'బలమే జీవనం.. బలహీనతే మరణం. సమస్త శక్తి నీలో ఉంది.. లక్ష్య సాధనలో వంద నరకాలైన అనుభవించేందుకు సిద్ధంగా ఉండు..కానీ విజయాన్ని సాధించే దాకా విడిచిపెట్టకు' అన్న స్వామి వివేకానంద మాటలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివిన యువత.. ఉద్యోగం రావడం లేదని ఎదురుచూడకుండా తమకు నచ్చిన, వచ్చిన రంగంలో రాణిస్తున్నారు. తమలో ఉన్న ప్రతిభకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలు రూపొందిస్తున్న వారు కొందరైతే.. ఎవరికింద పనిచేయడమేంటి?.. మనమే నలుగురికి ఉపాధి కల్పిద్దామని వ్యవసాయం, ఇతర స్వయం ఉపాధి రంగాల్లో దూసుకెళ్తున్న వారు మరికొందరు. నేడు(ఆదివారం) జాతీయ యువజన దినోత్సవం(వివేకానంద జయంతి) సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ రంగాల్లో రాణిస్తున్న యువతపై ప్రత్యేక కథనం.

గానుగ నూనె..ప్రకృతి సిద్ధం..

గానుగ తిప్పుతున్న రాజు- అశ్విని దంపతులు



భూపాలపల్లి రూరల్: ఆముదాలపల్లికి చెందిన భౌతు రాజు, అశ్విని దంపతులు డిగ్రీ వరకు చదువుకున్నారు. ఎద్దులతో గానుగ నూనె తయారీ యూనిట్ ఏర్పాటుచేసి స్వచ్ఛమైన పల్లి, నువ్వులు, కొబ్బరి, కుసుమ, ఇప్పనూనె తయారు చేస్తున్నారు. 30 కిలోమీటర్ల పరిధిలో ఉచితంగా రవాణా చేస్తుండగా, దూర ప్రాంతాల వారికి ఆర్టీసీ కార్గోద్వారా అందిస్తున్నారు. ఖర్చులు పోను నెలకు రూ.30వేల వరకు ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. మొదట్లో రూ.3లక్షల వరకు అప్పు తీసుకువచ్చి చెక్క గానుగ తయారు చేయించానని, కర్ణాటక, జహీరాబాద్, వరంగల్‌నుంచి ముడిసరుకును తీసుకువచ్చి తెచ్చి గానుగ నూనె తయారు చేస్తున్నట్లు రాజు 'సాక్షి'కి తెలిపారు.

పల్లె శాస్త్రవేత్తగా.. మహిపాల్‌చారి





మహిపాల్‌చారి తయారు చేసిన ఎలక్ట్రిక్ ట్రాలీ

పరకాల: సొంత ఆలోచనతో 11 ఏళ్ల క్రితం పవర్ వీడర్‌ను తయారుచేసి పల్లె శాస్త్రవేత్తగా పేరుపొందిన పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం సీతారాంపూర్‌కు చెందిన కడవెండి మహిపాల్‌చారి.. తాజాగా రైతులు తమ దిగుబడులను సులువుగా తరలించేందుకు పల్లె సృజన పేరిట ఎలక్ట్రిక్ ట్రాలీ తయారు చేశారు. పదవ తరగతి చదివిన మహిపాల్‌చారి 2013లో తయారు చేసిన పవర్ వీడర్‌ను స్థానిక రైతులకే కాకుండా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేశారు. ఈ క్రమంలో వ్యవసాయ కూలీల కొరతను దృష్టిలో ఉంచుకొని కల్టివేటర్, గ్రామాలకు, పట్టణాలలో ఉండే గోదాములకు ఎంతో ఉపయోపడే ట్రాక్టర్ అటాచ్‌మెంట్ క్రేన్‌తోపాటు ఎలక్ట్రిక్ ట్రాలీ(పల్లె సృజన) రూపొందించాడు. అమేజింగ్ ఇండియన్ అవార్డు సాధించాడు. 'దేశానికి అన్నంపెట్టే రైతుల కోసం ఎంత శ్రమించినా తక్కువే. వారి కోసం భవిష్యత్‌లో మరిన్ని పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తా'అని మహిపాల్‌చారి అంటున్నారు.

పాడిలో నకీర్త శ్రీనివాసు

పాడి గేదెలకు మేత వేస్తున్న శ్రీనివాసు



లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం క్లౌం గ్రామానికి చెందిన నకీర్త శ్రీనివాసు వ్యవసాయానికి అనుబంధంగా పాడి గేదెలతోపాటు గొర్రెల పెంపకం, కూరగాయలను సాగు చేస్తూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిలాగా నెలకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర సంపాదిస్తున్నారు. తనకు ఉన్న 14 ఎకరాలకు తోడుగా మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. 12ఎకరాల్లో కూరగాయలు, 10ఎకరాల్లో వరి, మిగిలినది గొర్రెలకు కంచెగా ఉపయోగిస్తున్నారు. అతని వద్ద ఎనిమిది మంది కూలీలు నిత్యం పని చేస్తుంటారు. 'నాకు ఇతరుల దగ్గర పనిచేయడం ఇష్టం ఉండదు. అందుకే గ్రామంలో వ్యవసాయం చేస్తున్నా. పాడి, గొర్రెల పెంపకం, కూరగాయలసాగుతో నెలకు రూ.లక్షన్నర వరకు సంపాదిస్తున్నా. ఎంతో సంతోషంగా ఉంది' అని శ్రీనివాసు అంటున్నారు.

మాధవి..కోళ్ల పెంపకంలో బిజీ..



నాటుకోళ్ల ఫాం నిర్వాహకురాలు దేవ మాధవి

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామానికి చెందిన దేవ మాధవి బీకాం కంప్యూటర్ పూర్తి చేసి ఉద్యోగం వైపు చూడకుండా నాటుకోళ్ల పెంపకంపై దృష్టి సారించింది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సూచనలతో మెప్మా ఆర్థిక సహకారంతో యూనియన్ బ్యాంక్ ద్వారా ముద్రలోను కింద తీసుకున్న రూ.5లక్షలతో వ్యాపారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యాపారంలోనూ మాధవి సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటున్నారు. వాట్సాప్‌లో ప్రత్యేకంగా ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. అందులో కోడి ఫొటో, జాతి ఇతర వివరాలను ఉంచుతున్నారు. 'వనరులను వినియోగించుకుని స్వయం కృషితో ఎదగాలన్నదే నా లక్ష్యం . దీనికి తోడు మరి కొందరికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో నాటుకోళ్ల పెంపకం వైపు దృష్టి సారించా'అని మాధవి చెబుతున్నారు.

ఉద్యోగం కన్నా వ్యవసాయం మిన్న..



కిరణ్ సాగు చేస్తున్న కూరగాయల క్షేత్రం

టేకుమట్ల: ఉద్యోగం కంటే వ్యవసాయం బెటర్ అంటున్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన ఒజ్జల కిరణ్. బీ ఫార్మసీ పూర్తి చేసి ఉద్యోగంపై ఆసక్తి లేక సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పత్తి, మిరప పంటలతోపాటు టమాట, వంకాయ, బెండకాయ, అల్చింత, పాలకూర, ఉల్లిగడ్డ, కాకరకాయ, సొరకాయ వంటి తదితర రకాల కూరగాయలను సాగు చేస్తూ అధిక లాభాలను గడిస్తున్నారు. 'నాకున్న మూడెకరాల భూమిలో రెండు ఎకరాల్లో పత్తి, మిరప పంటలతో పాటు, ఎకరం భూమిలో వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నా. ఉద్యోగం చేస్తే తీవ్ర మానసిక ఒత్తిడితో సమయమూ ఎక్కువగా కేటాయించాలి. అదే సొంతంగా వ్యవసాయం చేస్తే లాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది.' అని కిరణ్ తెలిపారు.

చదివింది ఎంటెక్.. వ్యవసాయంలో హైటెక్..



పాలీ హౌజ్‌లో పనిచేస్తున్న రమేశ్, లలిత దంపతులు

సాక్షి, మహబూబాబాద్ : తను చదివింది ఎంటెక్.. వ్యవసాయంలో హైటెక్ పద్ధతులు పాటించి ఏడాదికి రూ.20లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నాడు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం శివారు గంటల్ కోల్(జీకే తండా)తండాకు చెందిన గుగులోత్ రమేశ్. ఇతను ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్ విభాగంలో ఎంటెక్ పూర్తి చేశారు. నెలకు రూ. 50వేల వేతనంతో జెనెట్ టెక్నాలజీలో ఉద్యోగం చేశారు. డిగ్రీ పూర్తి చేసిన భార్య లలితతో హైటెక్ జీవితాన్ని ఆరంభించిన రమేశ్ వ్యవసాయంపై ఉన్న మక్కువతో సొంత ఊరికి వచ్చాడు. తనకున్న ఐదు ఎకరాల చెలకలో రెండు ఎకరాల్లో పాలీ హౌజ్ నిర్మించి రంగురంగుల చేమంతి పూలు సాగుచేశారు. వీటిని హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తూ ఎకరానికి సంవత్సరానికి రూ.16లక్షల చొప్పున ఆదాయం.. రెండు ఎకరాలకు రూ. 30లక్షలకు పైగా ఆదాయం రాగా.. ఖర్చులు పోగా రూ. 20లక్షలు మిగులుతున్నాయని చెబుతున్నారు రమేశ్, లలిత దంపతులు.

పథకాల అమలుకు జాబితా రూపొందించాలి

- కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ దివాకర అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధికి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు ప్యూరిఫికేషన్ పక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతు భరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి లబ్ధిదారుల పేర్లు జాబితాలో చేర్చాలని అన్నారు. ఇందిరమ్మ భరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించడానికి అవసరమైన జాబితాను తయారు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించే పక్రియను వేగంగా చేపట్టాలన్నారు. ప్యూరిఫికేషన్ ప్రక్రియ 16వ తేదీ నుంచి ప్రారంభించి 20వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. 18వ తేదీన ఫీల్డు వర్క్ పనులు పూర్తి చేసి 19వ తేదీ నాటికి కార్యాయలంలో సమీక్ష నిర్వహించి, తుది జాబితాను 20వ తేదీన సమర్పించాలని తెలిపారు. 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలని అన్నారు. ప్రతి మండలాన్ని రెండు భాగాలుగా విభజించి ప్రతి భాగానికి డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యత అప్పగించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు సీనియర్ అసిస్టెంట్, లేదా జూనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకుని డేటాను సక్రమంగా సమీక్షించి సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్, సంపత్‌రావు, అధికారులు తదితరులు ఉన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

- ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. శనివారం మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమానిత, అపరిచిత వ్యక్తులు గ్రామంలోకి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారాన్ని చేరవేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గ్రామస్తులకు సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని వాటిని తప్పకుండా పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని యువత చదువు, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. చదువు, క్రీడల ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామాల్లోని యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సతీశ్, వెంకటాపురం సీఐ బందారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు తదితరులు ఉన్నారు.

హేమాచల క్షేత్రం.. భక్తజన సందోహం

- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయ పరిసరాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం శనివారం భక్త జనసందోహంతో సందడి నెలకొంది. వందల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంతోపాటు, చింతామణి జలపాతం, వనదేవత(ద్తైతఅమ్మవారి) ప్రాంతం భక్త జనంతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి జిల్లాలోని లక్నవరం, రామప్ప, బ్లాక్‌బెర్రీ తదితర పర్యాటక ప్రాంతాలను తలకించేందుకు వచ్చిన పర్యాటకులు, మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న అనంతరం హేమాచలున్ని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి వివిధ వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు చింతామణి జలపాతం వద్ద స్నానాలు ఆచరించి కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్న భక్తులు లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు పూలు, పండ్లు నూతన పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర రామానుజ దాస్ స్వామివారికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిలతైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. తిలతైలాభిషేకం పూజలో పా ల్గొన్న భక్తులు మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. భక్తులకు ఆలయ పూజారులు గోత్ర నామాలతో అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని అందచేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా కనిపించింది.

పండుగ పూట పస్తులేనా..!

మూడు నెలలుగా అందని వేతనాలు

- ఇబ్బందుల్లో పంచాయతీ కార్మికులు
- జిల్లా వ్యాప్తంగా విధుల్లో 899 మంది



వెంకటాపురం(ఎం) మండల కేంద్రంలో డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న కార్మికులు



గ్రామంలో చెత్తను సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

వెంకటాపురం(ఎం): అంతంతమాత్రంగా వేతనాలు.. ఆపై నెలలు తరబడి బకాయిలు.. పూట గడవక ఇబ్బందులు.. ఆర్థిక కష్టాలతో అప్పులు.. ఇది జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికుల దుస్థితి. గ్రామ సచివాలయ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు లేనిదే గ్రామం పరిశుభ్రంగా ఉండదు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వెట్టి చాకిరీ చేయాల్సిందే. అయినా.. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కార్మికులు పండుగ పూట కూడా పస్తులేనా అని ఆవేదన చెందుతున్నారు.

174 పంచాయతీలు, 899 మంది కార్మికులు

జిల్లా వ్యాప్తంగా 174 గ్రామ పంచాయతీల్లో 899 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం జనాభా ప్రతిపాదికన మల్టీపర్పస్ వర్కర్ల నియామకానికి చర్యలు చేపట్టి ప్రతి 500 జనాభాకు ఒక కార్మికున్ని నియమించింది. గ్రామానికి ఒకటి చొప్పున 174 ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లను పంచాయతీ అధికారులు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.9,500 చొప్పున ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుంది. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ తిరుగుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అంతేకాకుండా నిత్యం గ్రామంలో మురికి కాల్వలు, రోడ్లు ఊడ్చుట, పాఠశాలలను శుభ్రం చేయడం, డ్రెయినేజీలను క్లీన్ చేయడం, చెత్తను తొలగించడం, పైపులైన్ లీకేజీల మరమ్మతుకు గుంతలు తీయడం లాంటి పనులు చేస్తున్నారు. వాటితోపాటు పల్లెప్రకృతి వనాల్లో నీళ్లు పట్టడం, రోడ్లవెంట నాటిన మొక్కలను సంరక్షించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పంచాయతీ పరిధిలో జరిగే ప్రతి పనిలో కార్మికులు నిమగ్నమవుతూ గ్రామాల ప్రగతిలో కీలకపాత్ర వహిస్తున్నారు.

మూడు నెలలుగా అందని వేతనాలు

జిల్లాలోని 9 మండలాల పరిధిలో 899 మంది కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందలేదు. సుమారు రూ.2.56 కోట్ల వేతనాలు కార్మికులకు చెల్లించాల్సి ఉంది. కొత్త ఏడాది నుంచి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పంచాయతీ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొంది. పంచాయతీ కార్యదర్శుల ద్వారా కార్మికుల బ్యాంక్ ఖాతాలు, ఆధార్‌కార్డులు సేకరించి కొత్త సంవత్సరం నుంచి నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమచేస్తామని వెల్లడించింది. దీంతో బకాయి ఉన్న రెండు నెలలతోపాటు ప్రస్తుత నెల వేతనం కూడా అందుతుందన్న కార్మికుల ఆశలు ఆడియాశలయ్యాయి. పది రోజులు గడిచినా వేతనాలు రాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. బకాయి వేతనాలు కాకుండా ప్రస్తుత నెల వేతనాలు చెల్లించిన పండుగను ప్రశాంతంగా జరుపుకుంటామని పంచాయతీ కార్మికులు పేర్కొంటున్నారు. సంక్రాంతి పండుగకు కిరాణ సామగ్రి కొనలేని పరిస్థితిలో ఉన్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికోసారి జరిగే సంక్రాంతి పండుగకు కూడ జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు పిండివంటలు చేసేందుకు కూడా జేబులో ఒక్క రూపాయి లేదని ఆందోళన చెందుతున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు తమవని, కరోనా సమయంలో సైతం ప్రాణాలుపణంగా పెట్టి విధులు నిర్వహించామని, ప్రస్తుతం వేతనాలు రాక అర్ధాకలితో అలమటిస్తున్నామని, ప్రభుత్వ అధికారులు స్పందించి వేతనాలు అందించాలని వారు కోరుతున్నారు.

పండుగకు వేతనాలు అందించాలి



కార్మికులందరికీ సంక్రాంతి పండుగకు వేతనాలు అందించాలి. పిల్లలతో చేసుకునే పండుగకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రతిరోజు గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ వెట్టిచాకిరీ చేస్తున్నాం. పండుగ పూట కూడా జీతాలు ఇవ్వకపోతే పండుగ ఎలా జరుపుకోవాలి. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు మంజూరు చేయాలి.

- చంద్రయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, ఏటూరునాగారం

మూడు నెలలుగా జీతాలు రాలేదు



మూడు నెలల నుంచి వేతనాలు రాలేదు. సర్పంచ్‌లు పదవిలో ఉన్నపుడు వేతనాలు రాకపోతే సర్పంచ్‌లను డబ్బులు బదులు అడుక్కొని ఖర్చులు వెళ్లదీసుకునే వాళ్లం. ప్రస్తుతం ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. కరోనా సమయంలో, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నాం. పంచాయతీ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎన్నమల్ల రంజిత్, పారిశుద్ధ్య కార్మికుడు, వెంకటాపురం(కె)

ఫిబ్రవరి 5 వరకు వేతనాలు చెల్లిస్తాం



జిల్లాలోని 899 పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో వేతనాలు చెల్లించలేదు. ఫిబ్రవరి 5వ తేదీలోపు రెండు నెలల వేతనాలు వారి ఖాతాలో జమచేస్తాం. మార్చి నెల నుంచి ప్రతి నెల 5వ తేదిలోపు వారి ఖాతాల్లో నేరుగా వేతనాలు జమ అవుతాయి.

- ఒంటేరు దేవరాజు, డీపీఓ ములుగు

క్లుప్తంగా

ఎన్నిక


ఉపేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి : తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన పెల్లి ఉపేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించగా వివిధ జిల్లాల నుంచి పలువురు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే,ఉమ్మడి వరంగల్‌జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మల్లారెడ్డిని రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, గొంగళ్ల అశోక్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఇతర కార్యవర్గాన్ని ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు.


ఆర్టీఏ సభ్యుల నియామకం

ఖిలా వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో నాన్-ఆఫీషియల్ సభ్యులను ప్రభుత్వం నియమించింది. హనుమకొండ జిల్లా రవాణాశాఖ నాన్-ఆఫీషియల్ సభ్యుడిగా గోపాలపురానికి చెందిన పల్లకొండ సతీశ్, వరంగల్ జిల్లా సభ్యుడిగా హనుమకొండలోని కాకతీయ కాలనీకి చెందిన కంభంపాటి శ్రీధర్, మహబూబాబాద్ జిల్లా సభ్యుడిగా కేసముద్రం స్టేషన్‌కు చెందిన రావుల మురళి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సభ్యుడిగా భూపాలపల్లికి చెందిన సుంకరి రామచంద్రయ్య, జనగామ జిల్లా సభ్యుడిగా సిద్దిపేట జిల్లాకు చెందిన కొమ్ము నర్సింగరావు, ములుగు జిల్లా రవాణాశాఖ నాన్-ఆఫీషియల్ సభ్యుడిగా వసంతా శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాగా, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్ శనివారం సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఇన్ఫోసిస్ సేవలు అభినందనీయం


ఇన్ఫోసిస్ ప్రతినిధులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ : ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సేవలు అభినందనీయమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కొనియాడారు. గతేడాది అక్టోబర్‌లో ఇన్ఫోసిస్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా కేయూలోని వివిధ విభాగాలకు 60 కంప్యూటర్లను ఉచితంగా అందజేసింది. అయితే ఆ యా కంప్యూటర్లను వినియోగిస్తున్నారా లేదా.. వాటిని ఎలా వినియోగిస్తున్నారు.. పనితీరు ఎలా ఉందని పరిశీలించేందుకు ఇన్ఫోసిస్ ప్రతినిధులు ఎం.వంశీ, కె.లావణ్య, వి.సుమంత్ శనివారం కేయూను సందర్శించారు. పరిశీలన అనంతరం అకడమిక్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడారు. 300 కంప్యూటర్లు కావాలని కోరగా తొలుత 60 అందజేశారని తెలిపారు. మరో 240 కంప్యూటర్లు ఇచ్చేందుకు సంస్థ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.



మమ్మేలు మల్లన్న..

నేటినుంచి ఐలోని జాతర ప్రారంభం | లక్షలాదిగా తరలిరానున్న భక్తజనం | ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


అతిశీఘ్ర దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ


జాతరలో ఏర్పాటైన పిల్లల ఆటవస్తువుల దుకాణం


మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తడకలతో నిర్మించిన గది



ఐనవోలు: భక్తుల కొంగు బంగారం.. లక్షలాది మంది ఇలవేల్పు.. ఐనవోలు శ్రీమల్లికార్జునుడు బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యాడు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర బ్రహ్మోత్సవాలు నేడు (ఆదివారం) విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జానపదుల జాతరగా ప్రఖ్యాతి పొందిన మల్లికార్జునస్వామి వారి జాతరకు పోయి రావాలె అని భక్తులు కోరుకుంటుండగా.. దేవాదాయ శాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు.

జాతర ఏర్పాట్లు పూర్తి

జాతర పనుల్లో భాగంగా క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, షవర్ స్నానాలు, మహిళలు దుస్తులు మార్చుకునే గదుల ఏర్పాటు, ఆలయం చుట్టూ లైటింగ్, సిరీస్ బల్బుల ఏర్పాటు తదితర పనులన్నీ తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. జాతర సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరాకు సంబంధిత శాఖ ఏర్పాట్లు చేయగా.. సుమారు 30 మంది విధులు నిర్వహించనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ 45 మందితో తాగునీరు, నీటి సరఫరాపై దృష్టిసారించింది.

పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

జాతరలో పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా జీడబ్ల్యూఎంసీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం చెత్త డంప్ చేయనున్నారు. అలాగే, ట్యాంకర్ల ద్వారా భక్తులకు నీటి సరఫరా చేయనున్నారు. కాగా, జాతర సక్సెస్‌కు సుమారు 2వేల మంది వివిధ శాఖల నుంచి అధికారులు, సిబ్బంది, వలంటీర్లు నాలుగు రోజులు 24 గంటలూ పనిచేయనున్నారు.

ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది 24 గంటలూ సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆర్టీసీ.. ఐనవోలు నుంచి హైదరాబాద్, వరంగల్, కాజీపేట, కొమురవెల్లి, వేములవాడ తదితర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించింది. ప్రధానంగా నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు వరంగల్ నుంచి ప్రతీ 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి 25 మంది, పంచాయతీ రాజ్ శాఖ నుంచి 271 మంది, జీడబ్ల్యూఎంసీ నుంచి 207 మంది, ఆలయం తరఫు నుంచి 30 మంది విధులు నిర్వర్తించనున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 11 మంది సీఐలు, 27 మంది ఎస్సైలతో కలిపి 349 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, దేవాదాయ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ గౌరీశంకర్.. ఈఓ అద్దంకి నాగేశ్వర రావుతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. డీసీపీ పులిగిల్ల రవీందర్ క్యూలైన్ల ఏర్పాట్లు పరిశీలించి ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌కు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి ఈఈ మల్లేశం జాతర ఏర్పాట్లను పరిశీలించారు.

వీఐపీ పాస్‌లు లేవు



ఈదఫా జాతరకు వీఐపీ పాస్‌లు జారీ చేయడం లేదు. వీఐపీలు ఎవరైనా అతిశీఘ్ర దర్శనం కావాలంటే రూ. 500 టికెట్ తీసుకోవాలి. ప్రత్యేకంగా క్యూలో తాగునీటి నల్లాలు ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ప్రసాదాల కొరత లేకుండా లడ్డూ, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేశాం.

అద్దంకి నాగేశ్వర రావు, ఆలయ ఈఓ, ఐనవోలు

నెహ్రూ జూపార్క్‌కు దీటుగా వరంగల్ జూ


టైగర్ ఎన్‌క్లోజర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు


ఎన్‌క్లోజర్‌లో తిరుగుతున్న పులి

- అటవీ శాఖ మంత్రి కొండాసురేఖ
- పులులు, అడవి దున్నలు, జింకల ఎన్‌క్లోజర్ల ప్రారంభం

న్యూశాయంపేట : హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్క్‌కు దీటుగా వరంగల్ జూపార్క్‌ను అభివృద్ధి చేస్తానని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ జులాజికల్ పార్క్‌లో పులులు (శంకర్, కరీనా), అడవి దున్నలు, జింకల ఎన్‌క్లోజర్లు, జూపార్క్ క్యూరేటర్ భవనాన్ని మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వాకీటాకీ ద్వారా కేర్‌టేకర్లతో మాట్లాడి బోన్లలో ఉన్న పులులు, అడవి దున్నలు ఎన్‌క్లోజర్లలోకి వదిలారు. అనంతరం హనుమకొండ జిల్లా అటవీశాఖ అధికారి బి.లావణ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ సెంట్రల్ జూ అథారిటీ అనుమతితో వరంగల్ శివారు గ్రామం దేవునూర్‌లోని 200 ఎకరాల అటవీ భూముల్లో మెగా జూపార్క్ ఏర్పాటునకు కృషి చేస్తానని చెప్పారు. త్వరలో జూపార్క్‌కు సింహాలు, తెల్లపులులు కూడా రానున్నాయని తెలిపారు. అంతకుముందు బ్యాటరీ వాహనంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జూలో కలియ తిరిగారు. ఈ సందర్భంగా జూపార్క్‌కు సంబంధించిన వెబ్‌సైట్, పోస్టర్, బుక్‌లెట్స్, పర్యావరణ పరిరక్షణ కోసం క్లాత్‌తో తయారు చేసిన బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు, భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమానాయక్, వరంగల్ డీఎఫ్‌ఓ అనూజ్, ఎఫ్‌ఆర్‌ఓలు భిక్షపతి, మయూరి, శిరీష, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మాణానికి కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- ముగిసిన రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో పోటీలు
- పురుషుల విభాగంలో విన్నర్ వరంగల్.. రన్నరప్ రంగారెడ్డి
- మహిళల విభాగంలో విన్నర్ రంగారెడ్డి.. రన్నరప్ మహబూబ్‌నగర్


ట్రోఫీతో వరంగల్ పురుషుల జట్టు

గీసుకొండ : వరంగల్ జిల్లాలో మినీ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. శనివారం రాత్రి వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో 57వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను స్పోర్ట్స్ కోటాలోనే పోలీస్ ఉద్యోగం సాధించి ఉన్నత స్థాయికి ఎదిగానని గుర్తుచేశారు. ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ ఓడిపోయిన వారు మరింత పట్టుదలతో కృషి చేస్తే విజయం సొంతం అవుతుందన్నారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఖోఖో జాతీయ స్థాయి పోటీలను రాష్ట్రంలో నిర్వహించాలని కోరితే సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కృష్ణమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. కైలాశ్‌యాదవ్, టోర్నమెంట్ ఆర్గనైజర్ వీరగోని రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట రాంబాబు, స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్, ఖమ్మం అసోసియేషన్ అధ్యక్షుడు పొడాల రామయ్య, పీఈటీ స్వప్న, హెచ్ఎం పట్టాభి, ఏనుగుల సాంబరెడ్డి, అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పురుషుల చాంపియన్ వరంగల్, మహిళల చాంపియన్ రంగారెడ్డి

రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి పది జిల్లాలకు చెందిన పురుషులు, మహిళల జట్లు మొత్తం 21 పాల్గొన్నాయి. ఇందులో పురుషుల ఫైనల్లో వరంగల్ జట్టు(33 పాయింట్లు) రంగారెడ్డి (29 పాయింట్లు) పై విజయం సాధించింది. మహిళల విభాగంలో రంగారెడ్డి జట్టు(23) మహబూబ్‌నగర్ (18)పై విజయం సాధించింది. తృతీయ స్థానంలో పురుషుల విభాగంలో హైదరాబాద్, ఆదిలాబాద్ జట్లు, మహిళల విభాగంలో నల్లగొండ, హైదరాబాద్ జట్లు నిలిచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహబూబ్‌నగర్‌కు చెందిన ఎం. శ్రీలక్ష్మికి రాణి రుద్రమ దేవి నగదు అవార్డు, వరంగల్‌కు చెందిన ఎస్. రాకేశ్‌కు కొమురంభీం నగదు అవార్డును అందించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

విద్యారణ్యపురి : టీచర్ల పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల బిల్లులతో పాటు ఇతర ముఖ్యమైన బిల్లులు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఆరేళ్లుగా తాను ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావించానని పేర్కొన్నారు. కొన్ని సమస్యలు మిగిలి ఉన్నాయని, వాటి పరిష్కారానికి మరోసారి తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. హెచ్ఎంలకు పదోన్నతులు ఇవ్వాలని, సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలని, డీఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, కార్యదర్శులు సోమశేఖర్, రంజిత్‌కుమార్, సమ్మారావు మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్‌కమిటీ సభ్యుడు డి.కిరణ్‌కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రవీందర్‌రాజు, పెండెం రాజు, తాటికాయల కుమార్, సి.సుజన్‌ప్రసాద్‌రావు, సభ్యురాలు ఎ.విద్యాదేవి, ఆల్ పెన్షనర్స్ అసోసియేట్ రాష్ట్ర కార్యదర్శి తూర్పాని సీతారాం, బాధ్యులు అన్నాదేవి, చంద్రయ్య, మోజెస్, కరుణాకర్, రమేశ్, సదానందం, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

రెండో రోజు తెలంగాణ బోణీ

- ఉత్కంఠంగా సెపక్‌తక్రా పోటీలు
- ముగిసిన టీమ్‌ఈవెంట్, డబుల్స్ పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న 34వ సీనియర్ నేషనల్స్ సెపక్‌తక్రా మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు ఉత్కంఠంగా సాగాయి. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభమైన పోటీలు రాత్రి 10గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నువ్వా? నేనా అనేలా జరిగాయి. రెండో రోజు ఆతిథ్య తెలంగాణ జట్లు రెండు పతకాలు సాధించి బోణీ కొట్టింది. తెలంగాణ మహిళల జట్టు డబుల్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా.. పురుషుల జట్టు కాంస్య పతకం తమ ఖాతాలో వేసుకుంది.

రెండో రోజు ఫలితాలు..

మహిళల టీం ఈవెంట్ సెమీఫైనల్‌లో..

- ఎస్ఎస్‌బీ (సర్వీస్ సెలక్షన్ బోర్డు)- మణిపూర్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో 2-1 స్కోరుతో ఎస్ఎస్‌బీ గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది.
- నాగాలాండ్ -ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన పోరులో 2-1 స్కోరుతో నాగాలాండ్ గెలిచి ఫైనల్‌కు చేరింది.

ఫైనల్‌లో ..

- ఎస్ఎస్‌బీ, నాగాలాండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 2-0 స్కోరుతో ఎస్ఎస్‌బీ గెలుపొంది బంగారు పతకం సొంతం చేసుకుంది.

పురుషుల టీం ఈవెంట్‌లో సెమీఫైనల్‌లో..

- ఎస్ఎస్‌బీ- మణిపూర్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో 1-2 స్కోరుతో మణిపూర్ గెలుపొందింది.
- ఢిల్లీ , అస్సాం జట్ల మధ్య జరిగిన సెమీస్‌లో 2-1 ఢిల్లీ గెలుపొందింది.

ఫైనల్..

- మణిపూర్, ఢిల్లీ జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో 2-0 స్కోరుతో మణిపూర్ విజయం సాధించింది.

పురుషుల డబుల్స్ ఈవెంట్‌లో..

- హరియాణా- ఆల్ ఇండియా పోలీస్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో 1-2 స్కోరుతో ఆల్ ఇండియా పోలీసుల జట్టు విజయం సాధించింది.
- బిహార్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన పోటీల్లో 2-0 స్కోరుతో బిహార్ గెలుపొందింది.

ఫైనల్‌లో..

- బిహార్, ఆల్ ఇండియా పోలీసుల జట్ల మధ్య జరిగిన పోటీల్లో 2-0 స్కోర్‌తో ఆల్‌ఇండియా పోలీసు జట్టు విజయం సాధించింది. కాగా, ఈ పోటీలో తెలంగాణ జట్టుకు కాంస్య పతకం లభించింది.

మహిళల డబుల్స్ ఈవెంట్‌లో..

- కేరళ -ఆల్ ఇండియా పోలీస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 1-2 స్కోరుతో ఆల్‌ఇండియా పోలీస్ జట్టు గెలుపొందింది.
- ఢిల్లీ -తెలంగాణ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 0-2 స్కోరుతో తెలంగాణ విజయం సాధించింది.

ఫైనల్‌లో..

- ఆల్ ఇండియా పోలీస్- తెలంగాణ జట్ల మధ్య జరిగిన పోటీల్లో 2-0 స్కోర్‌తో ఆల్ ఇండియా పోలీస్ జట్టు గెలుపొందింది. కాగా, ఈ పోటీలో తెలంగాణ జట్టుకు రజతం పతకం లభించింది.

టీచర్ ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్న

- 'కుడా' మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్


మాట్లాడుతున్న సుందర్‌రాజ్‌యాదవ్

హన్మకొండ చౌరస్తా: త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని, అండగా నిలవాలని 'కుడా' మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని అశోక కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలు ముందుకొస్తే వారి సపోర్ట్‌తో పోటీలో ఉంటానన్నారు. ఇంకా నోటిఫికేషన్‌కు సమయం ఉందని, బీఆర్ఎస్ నిర్ణయం కోసం ఎదురు చూస్తానన్నారు. పార్టీ టికెట్ ఇచ్చినా, ఇవ్వకున్నా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. ప్రెస్‌మీట్‌కు ముందు సుబేదారిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్, డిగ్రీ కాలేజీల సంఘం బాధ్యులు, వివిధ కుల, ప్రజాసంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'రియల్' రంగం బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్

కాజీపేట: తెలంగాణ రాష్ట్రంలో వివిధ కారణాలతో కాస్త వెనుకబడిన రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండల కేంద్రంలోని పీజీఆర్ గార్డెన్స్‌లో శనివారం 3వ క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం రూ.6వేల కోట్లు మంజూరు చేసి ప్రోత్సహిస్తుండడంతో రియల్ ఎస్టేట్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటేనే వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. క్రెడాయ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ రెడ్డి మాట్లాడుతూ కొనుగోలుదారులపై భారం పడకుండా రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాపర్టీ షోలో 18కి పైగా సంస్థలు స్టాళ్లు ఏర్పాటు చేయగా 2వేల మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమంలో శాసన మండలి ఉప సభాపతి డాక్టర్ బండాప్రకాశ్, నగర మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం బాలానంద్, జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, ఈవీ శ్రీనివాస్ రావు, సత్యనారాయణ రెడ్డి, రాంరెడ్డి, జగన్మోహన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ వెయ్యి ఏనుగుల బలం ఇచ్చింది..



ప్రాపర్టీ షో తిలకించడంతో పాటు వివిధ స్టాళ్లు పరిశీలించడానికి ఊహించిన దానికన్నా ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరుకావడం వెయ్యి ఏనుగుల బలం ఇచ్చింది. ప్రాపర్టీ షోలో ఇంటి స్థలం మొదలు.. తాళం వరకు లభించే వస్తువుల స్టాళ్లను ఏర్పాటు చేశాం. ఆదివారం కూడా షో అందుబాటులో ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు

మరణంలోనూ వీడని బంధం

- భార్య మృతి.. భర్త హఠాన్మరణం
- గంటల వ్యవధిలో దంపతుల మృతి


కొమురయ్య, సోమక్క దంపతులు(ఫైల్)

పాలకుర్తి టౌన్: గంటల వ్యవధిలో వృద్ధ దంపతులు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం తీగారంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైకాని సోమక్క(74), కొమురయ్య(82) దంపతులకు సంతానం లేదు. పిల్లలు లేకపోవడంతో బాలిక రమను పెంచుకున్నారు. ఆమెకు వివాహం చేయగా పిల్లలున్నారు. వృద్ధాప్యం కావడంతో సోమక్క, కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో సోమక్క శుక్రవారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందింది. భార్య మరణాన్ని జీర్ణించుకోలేని భర్త కొమురయ్య శనివారం ఉదయం మరణించాడు. వృద్ధ దంపతులు గంటల వ్యవధిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

తాటిచెట్టుపైనే గుండెపోటు


చెట్టుపై వేలాడుతున్న యాదగిరి మృతదేహం

హసన్‌పర్తి: కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన ఓ గీతకార్మికుడు చెట్టుపైనే గుండెపోటుతో చనిపోయాడు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ పరిధి 56వ డివిజన్ పరిమళ కాలనీలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. హసన్‌పర్తి మండలం సిద్దాపురానికి చెందిన బైరగాని యాదగిరి(73) నగరంలోని జవహర్‌కాలనీలో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. పరిమళ కాలనీలో ఉన్న తాటివనానికి వెళ్లి చెట్టు ఎక్కాడు. చెట్టుపైనే గుండెపోటు రావడంతో చనిపోయి మోకుకు వేలాడాడు. గమనించిన తోటి గీత కార్మికులు అతడిని చెట్టుపైనుంచి కిందికి దింపి చూడగా అప్పటికే మరణించాడు.